కథానిక :

## వాస్తవిక జగత్తులో

# నేను - మా ఆవిడ

శ్రీ భమిడిపాటి రామగోపాలం

అసలు మా ఆవిడ అంటే ఎవరు? నా పెళ్లాం. మా...అని ఉంది గదా, నీ పెళ్లాం అంటావేవిఁటి? అనబోకండి. దానికి కేవలం వ్యతిరేకం మా ఆవిడతో పంథా మా...అన్నది ఎంతో మందికి చెందదు. నా కొక్కడికే. మా—అంటే నాయొక్క. అది Royal we కి సంబంధించిన ఒక జాతీయం. ఒక్కొక్క జాతీయానికి తెలుగు భాషలో యిలాటి పరిస్థితులే సంభవిస్తాయి. యిక పదండి.

నాకు మా ఆవిడకి పెళ్లి కాకముందుటి సంగతి. నన్ను భర్తగా పొందాలని ఆ పిల్ల (అంటే మా ఆవిడ చిన్నప్పుడు) కోరలేదు (ఎవర్నీ కోరలేదు). ఆ పిల్ల వయస్సు పది సంవత్సరాలు. కాని నన్ను ఆమె పొందడం, నేను ఆమెని పొందడం కేవలం అదృష్టం బట్టే జరిగింది. అయితే నామట్టుకు నేను ఆ పిల్లని పెళ్లిజేసుకోవాలని కోరేను. యేవంటే అప్పటికీ మా ఆవిడలో సౌందర్యరేఖలు తొంగి జూస్తూ ముఖానికి వో దివ్యమైన కళ యిస్తున్నాయి. పువ్వు పుట్టగానే పరిమళిస్తుం దంటారు.

నేను మా ఆవిడని పెళ్లి కాకముందున్నుంచీ ప్రేమించుతున్నానని చెప్పేను కదూ! అయితే నా నోటమ్మట యిప్పుడు ప్రేమ అనే ముక్క, బుద్ధిపూర్వకంగానైనా, పొరపాట్న అయినా, జారితే, ఆ ముక్క అనొద్దని మా ఆవిడ శాసిస్తుంది. అసలు యీ ముక్క దాంపత్యంమధ్య రావెందుకు రావాలి? అని నేను తీరుబడిగా కూర్చొని ఆలోచిస్తూ వుంటాను. కాని ప్రేమ లేనిదే సృష్టే లేదు. అని వెంటనే తట్టుతుంది. అయితే మీ దాంపత్యంలో ప్రేమ అనే ముక్క యెప్పుడెప్పుడొస్తుంది? అంటారు మీలో కొందరు. చెప్పుతున్నా. మా ఆవిడకి అప్పుడప్పుడు ప్రణయకోపం వొస్తూంటుంది (పిల్లలు పుట్టకముందు ప్రతివాడిఆవిడకీ వొస్తుందని నా నమ్మకం.) ఆ ప్రణయ కోప సందర్భంలో ఆ కోపాన్ని చల్లార్చుదామని "యిందుకేనా నేను నిన్ను ప్రేమించాను?" అని అడుగుతాను. "ఆ ముక్క అనొద్దు" అని సున్నితంగా శాసిస్తుంది మా ఆవిడ. యేమి? అంటారు. మా ఆవిడకి కొంచెం (కొంచెమేమి? చాలా) పూర్వకాలపు వాసన. ఆమె మతంలో, ప్రేమ అనేది వొక కొత్త పదం; ప్రేమించడం వన పని గాదు.. ...అయితే యిహ, నామటుకు నేను, యీ 'ప్రేమ' అనే ముక్క నోటమ్మట వొదలకుండా వుండగల్నా?...ఊఁహూఁ! వుండలేను. యేమంటే నేను కొత్తకాలప్మనిషిని. నేను చదువుకున్న వాటిలో మాకు వుపవాచకాలన్నీ ప్రేమకథలు. నేను చూసిన సినీమాలూ, నాటకాలూ, అన్నీ ప్రేమమయం. నేను చదివిన నవల్సుకి ఆధారం ప్రేమ. కొన్ని సినీమాల్లోనూ నాటకాల్లోనూ ప్రేమదృశ్యాలు ఘోరంగా వుంటాయి. కొన్నింట్లో ప్రేమమయ మీ జగము; ప్రేమే దైవం, దైవమె ప్రేమ; యింత బ్రతుకూ ప్రేమమయం అని ఉద్బోధించారు. అంత ప్రేమమయప్రపంచంలో పుట్టి పెరిగిన నేను, 'ప్రేమ' అనే ముక్క నోటమ్మట కక్కకుండా వుండగల్నా..?

ఆడవాళ్లతో వ్యాపారం అంతా సున్నితం. మాట సున్నితం, పని సున్నితం; ఆలోచన సున్నితం. అంతా సున్నితమయప్రపంచం. తమ క్కావలిసింది భర్త(ల) దగ్గిర్నుంచి రాబట్టుకోవడంలో యెంతైనా సున్నితంగా వర్తిస్తారు. మా ఆవిడ ప్రతీనెలా యిరవైఆరో తారీకునించి మంచి మంచి చీరెలు యెవరింట్లో వున్నాయో, యెవరు కట్టుకుంటున్నారో, బాగా (బాహా) పరీక్షిస్తుంది. తెలియనిచోట ధరలుకూడా వాకబు చేయిస్తుంది. ముప్పయ్యో తారీకునించీ, మళ్లీ నెల యేడో తారీకు వరకూ చాలా ప్రేమగా, ముద్దుగా, చనువుగా, అప్పుడే కొప్పులో ముడుచుకున్న సంపంగిపువ్వంత సున్నితంగా ప్రవర్తించుతుంది. చెప్పిన పనెల్లా వెంటనే చేస్తుంది. అయిపోగానే పక్కని వొచ్చి కూచుంటుంది. నా విషయ్యమయిన అలంకరణాల్లో శ్రద్ధ యెక్కువ చూపుతుంది. అనుకుంటే, నిజంగా, సినిమాలో హీరాయిన్ అయినా హీరోమీద అంత ప్రేమతో వర్తించదు. ప్రతీనెలా రెండో తారీకునాడు సినిమాకు వెళ్తాను. అప్పుడు మా ఆవిడనికూడా తీసుకెళ్లాలి. (అది మా ఆవిడ చేసిన సున్నితమైన గృహశాసనాల్లో వొకటి.) ఇక సినిమాలో అన్నిటికంటే ఆవిడకళ్లకి ఆకర్షణీయంగా కనిపించేది యేమిటో తెలుసా?

మూడో తారీకునాడు పొద్దున్నే కాఫీ పట్టుకొచ్చి, అది తాగుతూంటే అతి సున్నితంగా అడుగుతుంది. ఆ సున్నితంలోనే నిలవదియ్యడం వుంది. "యేమండీ! చూచారా! పురాణం శాస్తుర్లుగారి కోడలు యెలాటిచీర! కట్టుగుందో! అలాటిది నా కోనాడన్నా కొని పెట్టేరూ? చుక్కలుచుక్కలూ గళ్లుగళ్లూ యెంచక్కా జల్తారంచూ, యెంత బావుందండీ! ఆఁ ...చక్కా అలాంటి చీరె కట్టుకుంటే చూడాలని మీకుమాత్రం లేదూ?... పైకి ఏదో లోకువయిపోతారని...... డబ్బు ఖర్చు అంటారుగాని మీకూ వుంది చీరెల సరదా! మరి యీ నెల జీతంలో అలాటి చీర కొంటారు గదూ! పదహారు రూపాయలేనట! ఆకాశపు వాళ్ల కొట్టుమీద దొరుకుతాయట!" (లేకపోతే నిన్న సినిమాలో కథానాయిక కట్టుకున్న చీరెలాంటిది) అంటూ, బుజాలు పట్టుకొని (అప్పటికి కాఫీ తాగడం అయిపోతుంది) వూపేస్తూ "అబ్బా! కొంటాను వూరుకోవే!" అనేవరకూ విడిచిపెట్టదు...అవును. కొంటానని చెప్పటం నాది తప్పే. కాని, యే మొగాడూ సున్నితపు జాతి (Gentle Sex) అయిన వాళ్ల సున్నితపు శాసనాలకి అడ్డుచెప్పడు. అది అంతఃపురరహస్యాల్లో వొకటి.... ఆఁ ...... పైజెప్పిన రెండు చీరెల్లోనూ ఏదో వొకటి కొనాలి. లేకపోతే సమ్మె కట్టుతుంది. యే సమ్మెకయినా ఆగొచ్చు గాని దీనికి ఆగలేం. శరీర మాద్యం భోజనంతో వుంది. గృహలక్ష్మి అలిగితే భోజనం...? లేకపోతే, అన్నిటికంటె సున్నితమైన ఆయుధం · యేడుపు ప్రయోగిస్తుంది. స్త్రీలకున్న ఆయుధాల్లో (అన్నీ సున్నితమైనవి;) అన్నిటికన్నా యిది సున్నితమైంది. యిదే పురుషుణ్ణి యెక్కువగా బాధపెట్టుంది... సరిగదా. యేడుస్తూన్న పెళ్లాన్ని బుజ్జగించకుండా... నేనే కాదు, యీ భూప్రపంచకమ్మీద... యే మొగుడూ వుండలేడు. ఇది అంతఃపురరహస్యం నెం. 2.

అదృష్టవశాత్తు మా ఆవిడ పచ్చి పల్లెటూరి పిల్లయినా, కళల్లోకెల్లా కళ, సంగీతం బాహా నేర్చుగుంది. వాళ్ల వూళ్లో బళ్లో అయిదో క్లాసు పేసయి పదకొండో యేట మా యింట మెట్టింది. మరి మూడేండ్లు సంగీతం ఒక్కటే చెప్పించింది మా అమ్మ. చిన్నప్పుడు మా అక్క నేర్చుకుంటున్నప్పుడు నేనూ పక్కని కూర్చునే వాణ్ణి. అంచేత నాకు మా ఆవిడకన్నా బాగా వొచ్చు సంగీతం. తీరుబడిగా వున్నప్పుడు నేను ఆలాపన చేస్తూ వో రాకమాలికో, లేక త్యాగరాజయ్యగారికృతో పాడుకుంటాను. ఇంతలో హంసనడకలతో మా ఆవిడొచ్చి పక్కని కూర్చొని వొక్కొక్క రాగం చెప్పేసి, మహా వొచ్చినదానిలాగ ఆలాపించబోతుంది. కాని రాక వూరుకుంటుంది. నే నప్పుడు వికటంగా నవ్వుతాను. ఆ నవ్వు మా ఆవిడకి కోపం తెప్పించుతుంది. వెంటనే లేచి వెళ్లిపోతుంది.

ప్రతీ నెలా చీరెలు కొనమని మా ఆవిడ యిబ్బంది పెడుతూండడం నాకు సంవత్సరం నరతో విసుగెత్తింది. వో నెల రెండో తారీకుని వో కృతిలాంటిది తయారుచేసేను వొచ్చీ రాని కవిత్వంతో. ఆ వేళ సాయంత్రం మామూలుగా సినీమాకి వెళ్లేం. మొన్నాడు పొద్దున్నే పడకకుర్చీలో కూర్చుని ఆలాపన చేస్తున్నాను పల్లవిని. యింతట్లో నవ్వుమొహంతో, అతి సున్నితంగా, కంకల్లాడుతూ కాఫీ పట్టుకొచ్చి "ముందు ఈ కాఫీ కొంచెం ఆలాపన చెయ్యండి; తరవాత ఆ కాఫీ ఎలాగా అవుతుంది!... ఊఁ! కానీండి! లాపోతే చల్లారుంది!" పల్లవి కాఫీ రాగంలో "రామ నా మొరాలకింపుమా!" రామ శబ్దం స్త్రీయర్థంలో వుపయోగించేను. యిదేదో త్యాగరాయకృతి అనుకుని పక్కని కూర్చుని, తాళం వేస్తూంది. చరణంలో—

"చీటికి మాటికిని - చీరెలు తెమ్మంటావు" అన్నది మహా స్పష్టంగా పాడి,

"మరి యిక తెమ్మనకుమీ!" అని వొక్కమారు ఆపుచేశాను. అప్పుడు మా ఆవిడ మొహం చూస్తే (నిజంగా కెమేరా లేదు గాని) ఫోటో తియ్యా లనిపించింది. అంతవరకూ నిత్యసుహాసిని అయిన ఆ ముఖాన్ని అలా మార్చిన నన్ను నేను అభినందించుకోవాలో తిట్టుకోవాలో నా కేమీ తెలీలేదు......పైగా ఆవేళ మూడో తారీకు; నిన్న సినిమాలో చీరో, లేక పొరుగింట సీతమ్మ చీరో, ఆవిడకి నచ్చిం దని సున్నితంగా నేను కాఫీ తాగుతూ వుంటే చెప్పడానికి వొచ్చింది. వొఖమారు యిలా మార్చేసేను. చట్టున అక్కణ్ణించివెళ్లిపోయింది. తరువాతఆగ్నెల్ల కోమారు చీరెవూసు నేనే యెత్తేవాణ్ణి. ఆవిడకి భయమే చీరెవూసెత్తడానికి. అవునండీ! యింట్లో అధమం వో పదిహేను చీరెలయినా వుంటాయి. ఇంకా గాదెవారి నరసమ్మగారు కట్టుగున్నలాంటిదీ, చల్లావారి రమణమ్మ కట్టుగున్నలాంటిదీ, సినిమాలోలాంటిదీ యెందుకు చెప్పండి? నన్నుచూడండి! అరడజను పంచెలూ రెండు లుంగీలూ, ఎనిమిది షర్టులతో కాలక్షేపం చేస్తున్నాను. యీమధ్యనే మూడు ఫేంట్లూ మూడు ఫుల్‌షర్టులూ కుట్టించుకోవాలని అనుకుంటున్నాను. అనుకున్నది ఆచరణలో పెట్టడం కొంచెం కష్టమయిన పని - ముందు మా ఆవిడ చీరెలని తనక్కి నెట్టాలి. ఆనక నా బట్టలు. ఆ వుద్దేశం మీదే 'యీ చీరెలు ఒక్కొక్కటే పదిహేను రూపాయలు మింగుతాయి కనీసం" అన్నాను అంటే మా ఆవిడ. "యేం కబుర్లండీ! మీ హాఫ్‌సూట్లో? పన్నెండు రూపాయ లవుతాయి. దానికీ దీనికీ వ్యత్యాసం యెంత? మూడేగా!" అంటుంది. మా కుటుంబ దేశంలో, నిజంగా యీ బట్టల సమస్య వొకటి కష్టసాధ్యంగా వుంది పరిష్కరించుకోడానికి. అందికే నే దీన్ని మీఅందరిముందూ పెట్టి బట్టబయలు చేసేను.

మా ఆవిడ పల్లెటూరిపిల్లని చెప్పేను; మంచి సౌందర్యవతి అనికూడా చెప్పివుంటాను. అందులోనూ నీతను కోరిన చీరెకొని, అది కట్టుకున్న తరవాతచూస్తే (తనుకోరిన చీరెకనక తనకి నచ్చుతుంది; తనకి నచ్చితే నవ్వు మొహంతో వుండాలి; నవ్వుమొహంతో వుంటే) ఇంకా అందంగా వుంటుంది. అదే నే నావిడని ప్రేమించడానికి కారణం. ఒక్క విశేషం వుంది. ఆవిడకి తను సౌందర్యవతినని తెలీదు. మా ఆవిడ సౌందర్యం సహజం. అంతేకాని స్నో పవుడర్ల మహత్యంకాదు. అందుకే మా యింట్లో స్నో పవుడర్లువుండవు. ఒక్క మైసూరు సాండల్‌వుడ్‌సోప్ తప్ప. అదీ నాకోసమే. పైవాళ్లు (నాకోసం) యెవరైనా వొస్తే వెంటనే లోపలి కెళ్లిపోతుంది. ఎవ్వరితోనూ మాట్లాడదు; ఎవ్వర్నీ చూడదు. అసలు నా వుద్దేశంలో అంత ముభావంగా వుండమని యేం కాదు. కాస్త కలివిడిగా వుండమనే. అలా అంటే కలివిడి చాలా ప్రమాదం అంటుంది.

నేను మా ఆవిణ్ణి చూసి, ఆ సౌందర్యంచూసి, అనుమానపడక్కర్లేదు; దానిపేరు ఒక పతివ్రత పేరు; ఆ పేరు నిలబెట్టుకోగల సామర్థ్యం ఆమెకి వుంది. పై మొగాడెవడైనా తనవేపు చూసినట్టు (ఆమెకి తెలీదు.) తెలిస్తే వెంటనే వాణ్ణి ఒక నీచమయిన పురుక్కింద కట్టేస్తుంది. వాడి వూసు యెత్తితే కోప మొస్తుంది. అట్టే అవసరం అయితే నా పాతచెప్పులకీ, గొరక చీపుళ్లకీ పని కల్పిసుంది బూజులు దులపకుండానే. ఆ గుణం పరిక్షిద్దామనే ఓ నాడు సాయంత్రం నిశ్చయించుకున్నాను.

అందరాడవాళ్లలాగా మా ఆవిడకి సాయంత్రం మంచిచీరె కట్టుకొని వీధుల్లో నిలబడ్డం అలవాటు లేకపోవడంవల్ల మా యింటి కిళ్లేసరికి తలుపులు బిడాయించి వున్నాయి. నేను గొంతు మార్చి—

"యేమండోయ్!" అన్నాను.

"యెవరది?" లో పల్నించి గంభీరంగా ఓ ప్రశ్న వొచ్చింది.

"నేనండి!"

"మా ఆయన లేరు!" ఇంకా తలుపు తియ్య లేదు. తలుపుతీస్తే నేను అనుమానపడడానికి కొంచెమేనా అవకాశం వుంటుంది.

"మీ కోసమే వచ్చానండీ! ఆయన లేకపోతే మరీ మంచిదీ! మన పని కింక అడ్డే వుండదు. ఇన్నాళ్లకి నాకు సమయం దొరికింది!" అన్నాను.

"ఎవడ్రా నువ్వు! వుండొస్తాను!" అని వెళ్లి తిరిగొచ్చి రౌద్రంగా తలుపు గడియ తీసింది. చేతులో ఓ పాత చెప్పుంది. నన్ను చూడగానే ఛటాల్ని ఆ చెప్పు పారేసింది. నాలో నేను ఋజువుపర్చుకున్నాను యింక అనుమానపడక్కర్లేదుగదా అని.

"అబ్బ! పొనిద్దురూ! యేమిటీ ఆటలు?" అంది నవ్వూ విసుగూ కలిసిన స్వరంలో.

"ఆఁ...యేం లేదు మాట వరసకి!" అన్నా. కోటూ చొక్కా విప్పుకుంటూవుంటే అవి అందుకుని లోపలపెట్టడానికి నుంచుని—

"కాదుగాని యెవడో ఆకతాయివెధవ అనుకొని, దవడ పచ్చడిజేద్దామని చెప్పు తీసుకొచ్చేను. నయం! చూసుకోకుండా నాలుగంటించేనుగాదు!" అంది.

"యేం? నాలుగంటించకపోయావా?"

"పోదురూ! మీరూ మీ మాటలూను! యెవరైనా వింటే నవ్వగల్రు!" అని కోటూ చొక్కా తీసుకుపోయింది.

మా వూరికీ, మా ఆవిడపుట్టిన వూరికీ మధ్య ఓ అరవై మైళ్లు రైలుమీద వెళ్లి, మూడుమైళ్లు బస్సుమీద వెళ్లి నాలుగుమైళ్లు నాటుబండీమీద వెళ్లాలి. మొత్తం వెళ్లి రావడానికి రెండురోజులు కనీసం పడుతుంది. అక్కడికి సంవత్సరాని కోసారి, లేదా రెండుసార్లు వెడుతుంది మా ఆవిడ. వెళ్లి అందరూ చేసినట్టు వో రెణ్ణెల్లు అక్కడ వుండిపోదు. పదిహేనురోజుల్లో వొచ్చి తీసుకురండి అని చెప్తుంది. వెళ్లిపోతూ వెళ్లిపోతూ మా ఆవిడ నాకిచ్చే మహోపదేశం ఈ విధంగా వుంటుంది. "పదిహేన్రోజుల్లో వొచ్చితీసుకురండి. లేకపోతే మీ రిక్కడ కాఫీ దగ్గిర్నించి హోటళ్లకి తగలేస్తారు. అప్పడాలూ వొడియాలు వున్నాయి. పెరట్లో కూరలు కాస్తయి. యేదో తీరుబడి చూసుకొని కూరచేసుకోండే. అంతగా కావాల్తే అప్పడమో వొడియమో చేసుకోండి. నిష్కారణంగా బద్ధకించి హోటళ్లకి తగలెయ్యకండి సామ్మ. పొద్దున్నే లేవగానే వో అర్ధశేరు బియ్యం కుంపటిమీద వేసుకున్నారంటే వో అరగంటసేపులో వుడుకుతుంది. అత్తిసరు పెట్టుకోండి మీరు వార్చలేరు...నె య్యయిపోయిందిగావున్ను...రేపు ఆదివారంనాడు పైడెమ్మ వొస్తుంది వో పావుశేరు కాలిపించుకోండి..." యింకా యెంతో.

వెళ్లివు తరమేనా రాయదు. రాయగలదు. కాని యేమో? "ఏం వుత్తరమేనా రాయలేదు?" అని అడుగుతాను వొచ్చేక. "వుత్తరం రాయగల్ను గాన్ని మావూళ్లోవాళ్లు నవ్వుతారు, మొగుడి కుత్తరాలు రాసిందే! అని. మొన్న రాసిన వుత్తరం, మా వెంకప్పగాడి చేతి కిచ్చి 'వొరే పోష్టులో పడేరా. యెవ్వరడిగినా చూబెట్టకు.' అని చెప్పేనండోయ్. వాడేం జేసేడూ! కాలేటబ్బికూతురు సోదెమ్మ నెరగరూ! అది పిల్చి అడిగితే చూపిట్టేడు. అక్కణ్ణించీ 'దీని విడ్డూరం చూడండి! మొగుడి కుత్తరం రాసిందే!' అని చాటుతోంది. నే వ్రాస్తాను! నా యిష్టం! నా మొగుడికి రాసేనా యింకెవర్తి మొగుడికేనా రాసేనా? మధ్య దీని కెందుకో!... అనోటా అనోటా పడి మా అమ్మ వింది. అసలదే రాయ

( 16వ పేజీ చూడుడు)

# నేను - మా ఆవిడ

(11-వ పేజీ తరువాయి)

నియ్యదు, 'కావలస్తే తమ్ముడిచేత రాయించక పోతే, అన్నయ్యొచ్చేకరాయించు. నువ్వురాయడ మేవిటే?' అనికూకమిలేసింది. పోనీగాని, వెంకప్ప రాయగల్డండీ? నాలుగోక్లాసు చదూతున్నా డన్నమాటేగాని కూడబలుక్కునే చదువు తాడు. అయినా వెంకన్న మేష్టారు చచ్చి పోయింతరవాత ఆబడి కెవ్వడూ శ్రద్ధబెట్టక అలా తగలడుతోంది...ఇక మా అన్నయ్య.. పదిహే నోజుల కోమా రొస్తాడు. నే నున్నప్పుడు వొస్తాడో రాడో! వా డొచ్చినప్పుడు నే నుంటానో వుండనో!...అంచేత మీకు మరి వుత్త రాలు రాయడం కుదరదు...కావలస్తే మీరు రాయండి!.. అయినా మీరు రాస్తే అలా యిలారాయరు. ప్రేమ గీమ అంటూ వో పుస్తకం రాస్తారు! అక్కణ్ణించీ 'యేమిట్రానేడే నీ మొగుడూ!' అంటూ వొస్తుంది మాఅమ్మ. యేటుటీ! యింక ఆ వుత్తరం దానికి చదివి విని పించాలి. నాకు సిగ్గేస్తుంది సుమండీ? మొన్న వారం వుత్తరం చ ద వ మ ం ది. వెంకప్పగా డొకడు. బడీ చదువూ అన్నీ వొదిలి వెనకాలే కూచున్నాడు. అప్పుడు, యేవో ఆ ముక్కలు తప్ప తక్కింది చదివేను. వెంకప్పగాడు వెనకొత ల్నించి 'అమ్మా! అక్క కొంత చదివి కొంత దాచేస్తోందే!' అన్నాడు. అయినా దానికి మాత్రం కనపడదూ! 'వోసి నీయిల్లు బంగా రంగానూ! యిదేనుటే అంత గ్రెంధవ్వూనూ?' అని సాగదీసుకుంది. మీరు రాసింది మూడు కౌయితాలు. రెండుకౌయితాలు ఆప్రేమచెత్తే. నాకు వొళ్లు మండిపోయేందిసుమండీ! నేను రాస్తే ఆతంటా మీరు రాస్తే యీతంటానూ!... మనం మరి వుత్తరాలు రాసుకోనే వొద్దు. పదిహే నోజుల్లో యేం కొంప మునిగిపోదు."

మా ఆఫీసువాళ్లమంతా వోసారి 'రేవతి'అనే సాంఘికనాటకం వేశాం. నేను అందర్లోనూ బాగా పాడగల్ననీ, నాకు హీరోపాత్ర యిచ్చేరు. ఆ నాటకానికి మా ఆవిడని తీసు కెళ్లి, ఓ రిజర్వుడు కుర్చీలోకూర్చోపెట్టి "నేను నాటకంలో వేస్తాను!" అనిచెప్పి వెళ్లిపోయాను. ఒక ప్రేమదృశ్యంలో నేను కథానాయకురాల్ని కవుగలించుకోవలసి వచ్చింది. ఆ దృశ్యంలో అట్లా చెయ్యాలని జ్ఞాపకం వొస్తే నేను మా ఆవిణ్ణి తిసుకురాకపోయేవాణ్ణి. కాని యేం జేదును! మొదటి దృశ్యంలో నన్నుచూసి పొంగి పోయిన మా ఆవిడ పరస్త్రీని కౌగలించుకుం టున్న నన్ను చూసే. అసహ్యించుకొని వెళ్లి పోయింది. బయట ఆఫీసుప్యూను రామస్వామి వుంటాడు. జట్కా వుంటుంది. ఆ దృశ్యంలో మరి బాగా నటించలేకపోయాను. నాటకం ఆఖర్న యింటి కొచ్చి చూద్దును మా ఆవిడ; యేడుస్తోంది.

"హయ్యొ పిచ్చిపిల్లా! నాటకంచూసి యిల్లా ఏడుస్తారా యెవరైనా; ఛే! అది వొట్టి నాటకం తెలుసా! పైని అసలు అలా జరగనిస్తానా?"

"ఈరోజు నాటకాలే వేస్తారు. రేపు.."

"ఆమాటంటావని నాకు తెలుసు! అనకు!" అని, ఆమా టనకుండా నోరు నానోటితో మూస్నేను.

"మరి నాటకాల్లో వెయ్యొద్దండీ! యేదో భగవంతుడిచ్చింది డబ్బూ మర్యాదావున్నాయి; మనకి మరి నాటకా లొద్దు!"

"పోనీ, నువ్వుకూడా వెయ్యి నాటకాల్లో!"

"చాల్లెండీ! సౌభాగ్యం! ఇంకా చాలక నన్నుకూడా వెయ్యమంటున్నారు! ఛీ! మీ లాగ నే నేం వాచి కూర్చోలేదు......నలుగురి యెదుటా—వేదికమీద...ఫలానివాడి పెళ్లాం... అని అందరూ ఆడిపోసుకోవాలా యేం?

"నువ్వు నాతోతప్ప యింకెవ్వరితోటీ నటిం చకు!"

"ఏమో బాబు! మీరు వెయ్యొద్దు, నేను వెయ్యను. మీరు వేస్తే నన్ను చంపుకుతిన్నట్టే,"

"అలాగేలే."

మూడురోజులు గడిచేయి. ఆనాడు మా ఆఫీసుగుమస్తా వొకడు నా కో ఫోటోగ్రాఫు ఇచ్చేడు. నాటకంలో నేను సరస్వతి పాత్ర ధారిణిని కౌగలించుకొన్నప్పుడు చాకచక్యంగా ఫోటో తీసేడు. నేను దాన్ని జేబులో దాచి వుంచేను యింటి కొచ్చిన తరవాత-

"అయితే, నువ్వు నాటకం యెంతవరకూ చూశావ్?" అని మా ఆవిడని అడిగేను.

"అప్పుడే నా కసహ్యంవేసి లేచి వెళ్లి వొచ్చేను. నాటకమంతా చూడలేదు!" అన్నది.

"మరోసారి చూస్తావా?" అని జేబులో వున్న ఫోటో చూపించేను.

"ఛీ! దరిద్రం!" అంటూ చించి, పారేసింది.

"పోనీ! నేను నాటకాల్లో వేస్తే వొచ్చిన నష్ట మేమిటి?"

"నష్టవేవిటా? మొదట నాటకాలే వేస్తారు. తరవాత, స్వర్గసీమసినిమాలోలాగ..."

"నీకు గాకుండా పోతానంటావ్! పిచ్చి దానా! నాటకాల్లో వేసినంత మాత్రంలో నీమేద ప్రేమ తగ్గిపోతుం దంటావా?"

".. ......" ఏడుపుమొహమే నాకు జవాబు.

"పోనీ మరి వెయ్యనులే!"

"అంతే గాదు. అవూసుకూడా యెత్తకండి!"

"అయితే...నాటకానికి తీసికెళ్తే వొస్తావా?"

"నేను రాను!"

"యేం?"

"ఆవేళలాగ నన్నక్కడ కూర్చోబెట్టి మీరు నాటకం వేస్తానని వెళ్తారు! నన్నేడిపించ డాని కెలా అయితేనేం?"

"నీయిష్టం!"

నిష్కారణంగా మా ఆవిడని యేడిపించడం యిష్టం లేక నేను మరి నాటకాల్లో వెయ్యలేదు. ఎప్పుడైనా నాటకం వొస్తే నన్ను వొదల్దు మా ఆవిడ, సినిమాకైనా వెళ్లనియ్యదు. అసలిల్లు కదల్నియ్యదు. దాని అనుమానం మరేం లేదు. కొంపదీసి నాటకంలో వేసేస్తానేమో అని! ఆమె వుద్దేశం యేమిటంటే, నాటకంలో వేసి నప్పుడల్లా అలాంటి పరిస్థితి సంభవిస్తుందని... మా ఆవిడకి భయపడే, నేను వో నాటకంలో హాస్యగాడి పోర్షనుకూడా వొదిలీసేను.

కొన్నాళ్లకిందట నే నొక కల్పితశృంగార స్వీయానుభవం రాసేను. అది స్వీయానుభవంగా మార్చడానికి కారణాలు లేకపోలేదు. నిజమని నమ్మాలి ప్రపంచం. అనుభవకర్త మనస్సులో వ్యూహాలు అతిసులువుగా ఎత్తి చూపొచ్చు. అది వో పత్రిక్కి పంపించాను. ఖర్మవశాత్తూ అది ఆ పత్రికవాళ్ళు ప్రచురించేరు. అభివందనాలతో వొక పత్రిక(సంచిక) పంపేరు మాకు. పోస్టుమేన్ చేతుల్లోంచి (నే నింటిదగ్గర లేక పోవడంవల్ల) మా ఆవిడ అందుకుని ఆ కథ చదివింది. ఆ కథ కల్పితం అని మా ఆవిడకి తెలీదు.

"చేసిన పని చేసిన ట్టూరుకోక,—అందరికీ తెలిసేట్టు అచ్చుకొట్టించుతారా? అదికూడా ఒక పేపర్ ఏమిటి?"

"ఏమయిందీ?" అని నేను మెల్లగా అడిగేను. నా కథపత్రికలో వేసినట్టూ, ఒక కాపీ నాకు వొచ్చినట్టూ నా కేమీ తెలీదు.

"మీరు బియ్యే చదివే రోజుల్లో...మీ మేనమామగారింట్లో...ఆయనకూతురు శకుంతలతో ...యెంత హాయిగా వుండేదండీ?" కోపం, అసూయ, మిళితమైన స్వరంలో ధమాయించి అడిగింది. జ్ఞాపకం తెచ్చుకోవడం కష్టమయినా, జ్ఞాపకమొచ్చిన తరవాత—

".. నీకేలా తెలిసింది?"

"నాకేమిటి? లోకానికంతటికీ తెలిసేటట్టు అచ్చు..." అంటూ ఆపుస్తకంతీసి, పేజీవిప్పడం కష్టంకూడా నాకులేకుండా "ఇదిచిత్తగించండి" అంటూ దమాయించింది.

నాస్థితి ఆలోచించండి! "ఆఁహాఁ! పడ్డదీ!" అంటూ నేను సరదాగా వున్నాను.

"అబ్బ! యేమి కులాసా! వొక్కమారు జ్ఞాపకమొచ్చిందిగాబోలు.. శకుంతల!...అందగత్తె. పదహారేళ్లపడుచు.." నేనుపకపక నవ్వి "అదంతా నిజమనుకుంటున్నావా వెర్రిదానా! ప్రతీదానికీ యిలా అపార్థాలుతీసుకుంటేయెలా? నేను బియ్యే యెప్పుడు చదివేనో నీకు జ్ఞాపకం లేదూ! నువ్వు కొత్తగా మా యింటి కొచ్చినప్పుడే! యెక్కడ చదివేనో తెలుసా! మాయింట్లోనే, యిక్కడే. ఆరోజుల్లో యెవరైనా నిన్ను మీబావ యేం చేస్తున్నాడని అడిగితే, బియ్యే చదువుతున్నారు అని చెప్పేదానివి! జ్ఞాపకం తెచ్చుకో! పోనీ అసలు సంగతి యేమిటో చూశావా? మా మేనమామ లిద్దరికీ కొడుకులే గాని కూతు ళ్లెక్కడ? కూతురుంటే..." మా ఆవిడ యింతసేపూ వింటూంది తల వొంచుకొని చిన్నచిరునవ్వుతో. యిప్పుడు మధ్యలో కల్పించుకొని, "కూతురుంటే నన్నెందుకు పెళ్లాడతారూ...?" అని సాగదీసింది.

"ఆ కథ వొఠ్ఠి కల్పితం. యిప్పటి కే నా తెల్సిందా?"

"సరే గాని," మాఆవిడ మూతి ముడుచుకొని అంటోంది.

"మీ రింక కథలు రాయకండి!"

"రాస్తే యేం?"

"ఎప్పుడో ఓనాడు నన్నుగూడా వీథిన జెడతారు...అచ్చువేయించుకూ?"

"నేను రాసేవన్నీ అబద్ధాలూ! నీ కేం?"

"అబద్ధాలూ వొద్దు నిజాలూ వొద్దు! యీసారి రాస్తే......"

"అఁ అఁ అఁ అఁ...వొట్టెయ్యకు! రాయన్లే!"

ఆనాటినుంచీ నేను మరి కథలు రాయడం మానుకున్నాను మా ఆవిడకి భయపడి. యేమిటి నువ్వు మాటాడితే మీఆవిడకి భయపడుతావ్! మొగాడివి కావుటోయ్! అనకండి. అలా భయపడాల్సిందే. స్త్రీఅంటే యేమి టనుకున్నారు?. ఊఁహుఁ! యేం లేదు...అనక దీన్నిగురించి వో పుస్తకం రాస్తాను... ఆఁ! యేమిటీ? భయపడాలికదూ! అవును! గాంధీఅంతటి మహాపురుషుడికి తప్పలేదు భార్యకి భయపడ్డం. అయినా, కాకపోయి నా అమాయకురాలు ఆమెని యేడిపించడం యెందుకనేనా వూరుకోవాలి.

"ఫోటో తీయించుకుందామా?" అని అడిగేను వోసారి మా ఆవిడని. ఆవిడకి, ఫోటో అంటే యేమిటో తెలుసు. మాయింటో మా నాన్నగారివీ, మాఅమ్మవీ, యిద్దరూ కలిసున్నవి, మా అక్కయ్యకి పెళ్లికాకముందు మేమందరం తీయించుకున్నది, మా అక్కా నేనూ, సంగీతం మేష్టారూ వున్నదీ, నా యింటర్మీడియేట్లోదీ యింకా యెన్నో ఫోటోలు రోజూ చూస్తూనే వుంది. కాని అవి యెలా వొస్తాయో తెలీదు. ప్రాథమిక తరగతుల్లో యీ ఫోటోలగురించి సుతరామూ చెప్పరు.

తీయించు అన్నది నొక్కి "ఫోటో తీయించుకోవాలా?" అంది. "అవును." అంటూ ఆ పద్ధతి అంతా యేకరుపెట్టాను.

"అక్కడికి మనం వెళ్లాలా, లేపోతే వాళ్లే వీథింట తిరుగుతారా అదేదో పట్టుగొని?" అని అడిగింది- వీథింట కూరలూ అవీ అమ్మే వ్యాపారసులు జ్ఞాపకం రాగా.

"మనమే అక్కడి కెళ్లాలి."

"అయితే సరే. మీరెళ్లి జట్కాబండి తీసుకు రండి!"

"కొంపదీసి యిలాగ వొస్తావేమిటి అక్కడికి? శుభ్రమైన చీరె కట్టుకో. కాఫీకలరు సిల్కు చీ రేమయింది? యిలాంటివాటికి పనికొస్తుం దనే కదూ కొన్నాం? సబ్బుపెట్లో వాసనసబ్బు తీసి వోమారు మొహం అదీ చక్కా తోముకో."

"అబ్బ! ఆ సబ్బునురుగు ముక్కులో దూరి మంటపెడుతుందండీ!"

"పరవాలేదులే!... ఆఁ...నే నొచ్చేసరికి శుభ్రంగా, సిద్ధంగా వుండాలి. యెంత శుభ్రంగా వుండాలో తెలుసా?...చూస్తే... ముద్దు..."

"ఛా! మీ రెప్పుడూ యిలాటి మాటలే!" అంటూ లోపలి కెళ్లి పోయింది.

"వీథితలుపు జాగర్త!" అని నేను వెళ్లి అరగంటలో తిరిగొచ్చేను.

"వో పావుగంటవుండవోయ్! బట్టలు మార్చుకోవాలి!" అని జట్కాఅబ్బితో చెప్పి వెళ్లేసరికి లోపల అప్సరకన్యలాగా వుంది తయారుగా మా ఆవిడ. నాపాఠం నాకే వప్పగిస్తోంది. అక్కణ్ణించి:

"నన్ను శుభ్రంగా వుండమని మీ రేమి టిలా తయారయ్యేరు?"


"వస్తున్నా." ఒక పదినిముషాల్లో శుభ్రంగా టాయిలెట్టయి వొచ్చేను.

సాధారణంగా, మగాడూ ఆడదీ కలిసి యెక్కడికైనా జట్కామీద వెళ్లాలనుకుంటే మగాడికి ఫుట్‌బోర్డుమీద కాలేసి కూర్చోడం గొప్ప సరదా. అంచేత ఆడదాన్ని లోపల కెళ్లమంటాడు. "కొంగు తగుల్తే కోటివేలు" అనుకొనే జట్కావాడు "మీదికి రండమ్మా! యింకా! యింకా!" అంటాడు. అది గమనించి మా ఆవిడ "మీరు లోపలి కెళ్లండి! నేనే పైన గూర్చుంటాను!" అంది. యిదే, స్వచ్ఛమైన మా ఆవిడగుణం తెలియజేస్తుంది.

ఇంకా యిలాంటి కథలు అనేకం వున్నాయి మాఆవిడనిగురించి.

మొత్తానికి మా ఆవిడకి సౌందర్యానికి తగిన చిలిపితనం, చలాకీతనం ధర్మం, న్యాయం మొదలైన గుణాలు వున్నాయి: చదువుకోకుండా, అంత అక్షరశూన్యురాలు గాకుండా వున్నదాన్ని చేసుకున్నందుకు నేను చాలా అదృష్టవంతుణ్ణి. యిందుకుముఖ్యంగా మాఅమ్మ వందనీయురాలు. (ఆమె ఆత్మ శాంతి నొందుగాక!) దగ్గిరవాళ్లకి పెడసరం యెక్కువ. చదువుకున్నదానికి ప్రపంచం కనపడదు (అందులో మనదేశంలో). చదువుకోనిదాంతో అసలు వేగలేం. యివన్నీ తప్పించి నాకు యీ పెళ్లి జేసినందుకు మాతల్లిని యెంత మెచ్చుకుంటే గ్రంథం విసుగవుతుంది? యింత మంచిపెళ్లాం యింకెవరికీ దొరక దని నా నమ్మకం. కాస్త దొరికినా దుర్వినియోగం చేసుకుంటారు కొందరు మూర్ఖులైన భర్తలు. వినియోగం చేసుకోడం తెలిసినవాడికి యేది దొరికినా పర్వాలేదు. "కనకపు సింహాసనమున శునకము గూర్చుండబెట్టి పట్టము గట్టినా వెనుకటి గుణం మానదు."

ఆఁ...ఇక ఆఖరుసంగతి. మాసంసారం అంతా యిట్లా వీథి బెట్టానని మా ఆవిడ దెబ్బలాడదు; తెలిస్తే దెబ్బలాడుతుంది. కాని తెలీకుండా వుంచగల్ను. ఏమంటే, యీమధ్యనే పుట్టింటి కెళ్లింది. మళ్లీ ఆరేడునెల్లవరకు రాదు. మే మిద్దరం మాతాపితలం (అవబోతున్నాం లెండి!) అయిం తరవాత, మా ఆవి డొచ్చింతరవాత, మీ కందరికీ వో పెద్ద టీపార్టీ చెయ్యగలనని అనుకుంటున్నాను.



బత్తుల కామాక్షమ్మగారు నిర్వహించుచున్న సంస్కృతకళాశాలను రాష్ట్రపతి సందర్శించినప్పుడు తీసిన ఛాయాచిత్రం.

గనోక్యూర్
[illegible]
ఈశ్వర ఫార్మసీ, రాజమండ్రి